క్లుప్తంగా

ఓటరు జాబితా మార్పులపై శిక్షణ



బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ ఇస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి : స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో గురువారం బూత్ స్థాయి ఏజెంట్లకు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఓటరు జాబితా మార్పులపై శిక్షణ ఇచ్చారు. బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా అప్‌డేట్ చేయడానికి ఈనెల 9, 10 , 23, 24 తేదీల్లో బూత్ స్థాయి ఏజెంట్లు వారి పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉండి వినతులు స్వీకరిస్తారన్నారు. ఓటరు నమోదు, మార్పులకు సంబంధిత వినతులు వారివద్ద అందజేయవచ్చన్నారు. పట్టణ ప్రజలు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం : అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇంటిలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి 'ఉల్లాస్' అనే కేంద్ర పథకానికి భారత ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ.. వయోజన విద్య మొత్తం స్వరసప్తకాన్ని కవర్ చేసే ఆన్‌లైన్ మాడ్యూల్స్‌ను ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. సంఘమిత్రలు బాధ్యతగా తీసుకుని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కవిత, సంఘమిత్రలు పలువురు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం : సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ భద్రత కోఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద సూచించారు. సమావేశంలో అధ్యాపకులు మున్వర్, భక్షు, శంకర్‌రెడ్డి, ఇస్మాయిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం వనదుర్గాపురంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఏ గ్రేడ్‌లో ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని సూచించారు. అనంతరం పరీక్షలు ఎలా రాశారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోదండయ్య, రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలు.. కళ్లకు గంతలు

- వర్షాలకు ఛిద్రమైన అత్తూరు కాలనీ రహదారి
- పొలాలు , పాఠశాలలకు వెళ్లేందుకు ఒకటే మార్గం
- కనీస మరమ్మతులు పట్టని అధికారులు





అధ్వానంగా అత్తూరు - ఎస్టీ కాలనీ రోడ్డు

నింద్ర : అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు ప్రసంగాలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు సాగించిన కూటమి నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడుస్తున్నా వారికి రోడ్లపై గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే ముందుగా గుంతలు పూడ్చివేస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. ఇప్పుడేమో చేతల్లో కాదు.. మాటలకే పరిమితం అవుతున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులనూ పట్టించుకోవడం లేదు.

మండలంలోని అత్తూరు నుంచి అత్తూరు ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు దృష్టిసారించడం లేదు. అత్తూరు గ్రామంలో సుమారు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరిలో సుమారు 200 మంది రైతు లు తమకున్న 120 ఎకరాల పొలాలకు ఈ మార్గం గుండానే వెళ్లాలి. అలాగే అత్తూరు ఎస్టీ కాలనీలోని 60 కుటుంబాలకు చెందిన విద్యార్థులు పాఠశాలకు రావాలంటే ఈ రహదారిపైనే రావాలి. ఈ రోడ్డుకు ఇంత ప్రాధాన్యం ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పదేళ్ల కిందట మరమ్మతులు

రోడ్డు లేకపోవడంతో గతంలో రైతులందరూ కలసి వారి పొలాల నుంచి రోడ్డుకు కొంత కేటాయించడంతో ఈ రహదారి ఏర్పడింది. అప్పట్లో పంచాయతీ నిధులు వ్యయం చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికి పదేళ్లు దాటుతున్నా ఆ రోడ్డు ఎలా ఉందో అధికారులు చూడలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా ఛిద్రమై బురదమయం కావడంతో ఆ మార్గంలో వెళ్లడం కత్తి మీద సాములా మారింది.

రైతులు, విద్యార్థులకు నిత్య నరకం

వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధానమైన మార్గం కావడంతో రైతులకు నిత్యనరకంగా మారింది. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు అదుపు తప్పి పడిపోతున్నారు. వాహనాలు గుంతల్లో దిగడంతో బురద, రాళ్లు అటుగా వెళ్తున్న జనాలపై ఎగిరి పడుతుండటంతో వారు గాయాలపాలవుతున్నారు. పండించిన పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించాలన్నా ఈ మార్గంలో కష్టతరమవుతోంది. చెరకు పంట దిగుబడులను ఇక్కడి నుంచి తరలించడం గగనంగా మారింది. ఎస్టీ కాలనీ నుంచి అత్తూరుకు వచ్చే విద్యార్థులు అతి కష్టం మీద పాఠశాలలకు చేరుకునే దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై రైతులు, ఎస్టీ కాలనీ వాసులు ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కనీసం రాకపోకలకు వీలు కాని విధంగా ఉన్న ఈ మార్గంలో గుంతలను తక్షణం పూడ్చి మరమ్మతులైనా చేపట్టాలని రైతులు, విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయాలి



అత్తూరు నుంచి ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గం గుంతలతో నిండిపోయింది. పలువురు రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. వర్షం వచ్చే సమయాల్లో నీటిలో గుంతలు తెలియక పలువురు గాయాలపాలవుతున్నారు. మహిళలైతే ఆచితూచి నడవాల్సిన పరిస్థితి ఉంది.

– కస్తూరమ్మ, రైతు, అత్తూరు

నడక నరకప్రాయమే..



అత్తూరు నుంచి ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డుపై ప్రయాణించడం నరకప్రాయమే. రైతులతో పాటు విద్యార్థులు కూడా ఈ దారిలో ఇబ్బంది పడుతూ వస్తున్నారు. పొలానికి వెళ్లాలంటే మరో మార్గం లేదు. ఈ మార్గంలో బురద రోడ్డులోనే వెళ్లాలి. అధికారులకు మా సమస్యలు పట్టడం లేదు.

– నిర్మల,రైతు అత్తూరు

దిగుబడులు మార్కెట్‌కు చేర్చలేకున్నాం



పండించిన పంటను పొలాల నుంచి మార్కెట్‌కు తరలించడం గగనమవుతోంది. పొలాలకు అత్తూరు ఎస్టీ కాలనీ వారికి రోడ్డు సౌకర్యం కోసం మా పొలాల్లో కొంత స్థలాన్ని త్యాగం చేశాం. కానీ ఈ రహదారి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

– విశ్వనాథం, రైతు, అత్తూరు

జెర్సీ ఆవులతోనే అధిక పాల దిగుబడి



సంకరజాతి జెర్సీ ఆవును ప్రదర్శిస్తున్న పశుసంవర్ధక శాఖ వైద్యులు

శ్రీరంగరాజపురం : సంకరజాతి జెర్సీ ఆవులతోనే అధిక పాల దిగుబడి సాధ్యమని పీటీపీ ప్రాజెక్టు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య పేర్కొన్నారు. మండలంలో శెట్టివనత్తం పంచాయతీ సచివాలయం వద్ద జెర్సీ పెయ్య దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంకరజాతి జెర్సీ ఆవుల ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చన్నారు. జెర్సీ , సాహివాల్ జాతి ఆవుల కలయికతో సంకరజాతి జెర్సీ ఆవులను ఉత్పత్తి చేస్తున్నారన్నారు. 2019 సంవత్సరం నుంచి దాదాపు 300 మేలు జాతి ఆవులను ఉత్పత్తి చేసి పాడి రైతులకు అందించినట్లు తెలిపారు. ఆవుల పెరుగుదలకు పౌష్టికాహారం, మందులు, పాల క్యాన్‌లను పాడి రైతులకు ఉచితంగా అందించారు. కార్యక్రమానికి పశుసంవర్ధకశాఖ డీడీ గోవిందయ్య, ఏపీఎల్‌డీఏ బాలసుబ్రహ్మణ్యం , ఏడీ రూపాసుందరి, మండల పశువైద్యాధికారి శ్రీవిద్య, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, సర్పంచ్ రఘునాథ రెడ్డి, పశువైద్య సహాయకులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం ప్రభుత్వ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ప్రజావేదిక నాయకులు కుమార్‌రెడ్డి

పుత్తూరు : ప్రపంచంలోని మానవాళి దోపిడీ రాజ్యం నుంచి విముక్తి పొందాలంటే సోషలిజమే శరణ్యమని జిల్లా ప్రజావేదిక సంఘం కార్యదర్శి కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పుత్తూరులో సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి అధ్యక్షతన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సోషలిజం నిర్మాణంలో లెనిన్ పాత్ర చాలా గొప్పదని తెలిపారు. సోషలిస్టు విప్లవం విజయవంతంగా 107 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పుత్తూరులో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సోషలిజం ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జబ్బార్, నీలమ్మ, చంద్రారెడ్డి, వెంకటరత్నం, మునేంద్ర, సురేష్, చెంగల్‌రాయులు, రామూర్తి, లక్ష్మీపతి, శివ, సంపత్, రమేష్, హేమలత, లీలావతి, అమరావతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా



నివాళి అర్పిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్

శ్రీరంగరాజపురం : మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత పోస్ట్‌మెన్ దామునాయుడు తల్లి మునెమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయనతో పాటు స్థానిక సర్పంచ్ వరదమ్మ, వి.వి.పురం సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు దామునాయుడు, డిశంబర్‌సెట్టి, గండు, శివలింగం పాల్గొన్నారు.

అధికారులు మారినా.. పేర్లు మారలే !

పాలసముద్రం : మండల పరిషత్ కార్యాలయంలోని వివరాల బోర్డులో సమాచార, సహాయ సమాచార అధికారులు బదిలీపై వెళ్లిపోయినా పాత అధికారుల పేర్లే దర్శనం ఇస్తున్నాయి. సమస్యలతో వచ్చిన ప్రజలు ఎవరికి తెలియజేయాలో తెలియక తికమక పడుతున్నారు. పరిపాలనాధికారి విద్యావతి బదిలీల్లో కార్వేటినగరం వెళ్లారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి బదిలీపై కడపకు వెళ్లారు. ఆ స్థానంలో కొత్తగా అధికారులు వచ్చినా వివరాల బోర్డులో మాత్రం మార్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులో పేర్లు మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా స్కౌట్ ఆవిర్భావ వేడుకలు



పుత్తూరులో స్కౌట్ అండ్ గైడ్స్ ర్యాలీ

పుత్తూరు : క్రమశిక్షణకు మారుపేరు స్కౌట్ అండ్ గైడ్స్ అని డీఎస్పీ రవికుమార్ అన్నారు. గురువారం సాయంత్రం 75వ స్కౌట్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీని డీఎస్పీ ప్రారంభించారు. ర్యాలీలో పట్టణంలోని వివిధ జడ్పీ హైస్కూల్స్‌కు చెందిన స్కౌట్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సుకన్య, జ్యోత్స్న, కావ్య, యువశ్రీ, కవిత, మహీధర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుత్తూరు : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు , అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



తంగరాజ్ (ఫైల్)

విజయపురం : విజయపురం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ తంగరాజ్ (41) గురువారం ఆకస్మిక మృతి చెందాడు. ఆయన స్వగ్రామం నగరి మండలం దేశూరుఅగ్రహారం. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. తంగరాజ్ మృతికి ఎస్ఐ బలరాంతో పాటు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అలసత్వం వద్దు

గంగాధర నెల్లూరు : మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉండటంతో పారిశుద్ధ్యంపై అలసత్వం ప్రదర్శించకూడదని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా గంగాధర నెల్లూరు పంచాయతీ పరిధిలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పర్యవేక్షించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం లోపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.

వైభవంగా సూర సంహార వేడుకలు



షణ్ముఖ అవతారంలో సుబ్రహ్మణ్యస్వామి

నగరి : పట్టణ పరిధిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సూర సంహార వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం ఉత్సవాల్లో ఆరో రోజు షష్ఠి కావడంతో ఆలయం హరిహర నామస్మరణతో మార్మోగింది. పలువురు భక్తులు ఆలయంలో 108 సార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో వళ్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి చందన, పంచామృతాభిషేకాలు, కలువ, చామంతి పూలతో సుందరంగా అలంకరించారు. 5 రకాల ధూప దీప హారతులు ఇచ్చారు. షణ్ముక అవతారంలో సుబ్రహ్మణ్యస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఈశ్వరగుడి వీధిలో సూరుని ప్రతిమను బాణసంచాల ద్వారా పేల్చి సూర సంహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నైపుణ్య గణన పకడ్బందీగా చేపట్టాలి



శ్రీరంగరాజపురం : మాట్లాడుతున్న మోహన్ మురళి

విజయపురం (వడమాలపేట) : నైపుణ్య గణన 2024కు సంబంధించి సర్వే పకడ్బందీగా చేపట్టాలని వడమాలపేట ఎంపీడీవో శేషగిరిరావు పేర్కొన్నారు. గురువారం మండల కార్యాలయంలో నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో 15 నుంచి 59 సంవత్సరాల వయసు గల వారి నుంచి సమగ్ర సమాచారం తీసుకోవాలన్నారు. దీని ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధార్ ఆధారిత ఓటీపీ , బయోమెట్రిక్ ద్వారా యానిమేటర్లు వివరాలను సేకరిస్తారని, ఓటీపీని బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఆయన సూచించారు. ఒక్కో అభ్యర్థికి 70 నుంచి 80 ప్రశ్నలు నమోదు చేయాల్సి రావడంతో పది నిమిషాల వరకు సమయం పడుతుందని, ప్రజలు విద్యార్హత సర్టిఫికెట్లు ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకుని ఉంటే సర్వే త్వరగా పూర్తి చేసే వీలు కలుగుతుందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరూ సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి దయాసాగర్, స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ లక్ష్మీమోహన్, హెచ్‌ఆర్ శ్రావణి పాల్గొన్నారు.

నింద్ర : గ్రామాల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించాలని ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించడంతో పాటు నైపుణ్యం లేని వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై సచివాలయ ఉద్యోగులకు సూచనలు , సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనా అధికారి కృష్ణయ్య, ఈవోపీఆర్‌డీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : స్వయం సహాయక సంఘ సభ్యులకు అక్షరాస్యతపై గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహన్ మురళి మాట్లాడుతూ.. గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడం కోసం ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్య ద్వారానే సాధ్యమన్నారు. సమావేశంలో ఏపీఎం రోజా, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో

రోడ్డుపై వర్షపు నీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం బంగారెడ్డి కండ్రిగ ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని గురువారం ఎంపీడీవో సిబ్బంది తొలగించారు. మంగళవారం 'ఊరు మధ్యలో మడుగు..నిగ్గదీసి అడుగు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. దీనిపై స్పందించిన ఎంపీడీవో శేషగిరి రావు తన సిబ్బందితో పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని తొలగించి, శాశ్వతంగా సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానిక ప్రజలు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.





పైపులైన్ ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీవో

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- వ్యక్తికి తీవ్ర గాయాలు





గాయపడిన చిన్నా, ధ్వంసమైన ద్విచక్ర వాహనం

గంగాధర నెల్లూరు : అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు గంగాధర నెల్లూరు పంచాయతీ కట్టకిందపల్లె దళిత వాడకు చెందిన చిన్నా ద్విచక్ర వాహనంపై మండల కేంద్రం గంగాధర నెల్లూరు కూడలి వద్ద నిరీక్షిస్తుండగా అతివేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు చిన్నా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్ నివారణ

నగరి : ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్‌ను నివారించవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, జువాలజీ విభాగాలు కేన్సర్ అవగాహన దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడం నివారణలో కీలక పాత్ర వహిస్తుందన్నారు. కేన్సర్ కారకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం లక్షణాలను గుర్తించడంలో సహకరిస్తుందన్నారు. ముందస్తుగా చికిత్స పొందేలా ప్రజలను ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎంపిక చేసుకోవడమే సదస్సు లక్ష్యమన్నారు. మూడో సంవత్సరం బీజెడ్‌సీ విద్యార్థిని హేమావతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేన్సర్ అవగాహన, దాని కారణాలు, జీవనశైలిని విశదీకరించగా ఆమెకు బహుమతిని అందించారు. కేన్సర్ అవగాహనపై విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. భాస్కర్‌రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ డా.పి.మహేశ్వరి, అధ్యాపకులు డా.స్వాతి, డా. తిరుమల వాసుదేవరావు, డా.వరలక్ష్మి, డా.శ్రీలక్ష్మి, డా.గోపి, కిరణ్, లాల్ భాష పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

పుత్తూరు : కేన్సర్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండి సరైన పోషకాహారం తీసుకుంటూ నిర్ణీత వ్యవధుల్లో ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం ద్వారా కేన్సర్‌ను నియంత్రించవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేన్సర్ అవగాహన దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ధూమపానం, మద్యపానం, పొగాకు నమలడం వంటి వాటికి దూరంగా ఉంటే క్యాన్సర్ మనకు చాలా వరకు దూరంగా ఉంటుందన్నారు. సరైన అవగాహన లేకపోవడంతో దేశంలో పురుషులు ఊపిరితిత్తుల , మహిళలు వక్షోజాల కేన్సర్ బారిన పడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలను సైతం ఆ వ్యాధి నుంచి రక్షించుకోవడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు శాంసన్‌రాజు, వెంకటకృష్ణయ్య, డాక్టర్ షర్మిల, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేసుకోవాలి

పాలసముద్రం : క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుంటే కేన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం జాతీయ కేన్సర్ వ్యాధి దినం సందర్భంగా పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ.. రొమ్ముల్లో మార్పు, నిరంతరం దగ్గు, గొంతు బొంగురు పోవడం, కారణం లేకుండా అలసట, అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటివి కనబడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.







కేన్సర్ వ్యాధి గురించి వివరిస్తున్న విద్యార్థిని, పాలసముద్రం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, పుత్తూరు : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి